

**సోమశిలలో 73.489 టీఎంసీల నిల్వ**

సోమశిల: జలాశయంలో శనివారానికి 73.489 టీఎంసీలు ఉన్నాయి. ఎగువ నుంచి 10,187 క్యూసెక్కుల వరద వస్తోంది. డెల్టాకు 2,500, ఉత్తరకాలువకు 500, కండలేరుకు 5 వేలు, దక్షిణ కాలువకు 150 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



**బంగారం ధరలు**

| | |
|---|---|
| 24 క్యారెట్లు (10 గ్రా) | రూ.78,450 |
| 22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా) | రూ.7,115 |
| 3 శాతం జీఎస్టీతో | రూ.7,328 |
| నవర (8 గ్రా) | రూ.58,624 |

గరిష్టం/కనిష్టం 30.1 /26.0

**వాతావరణం**

జిల్లాలో ఆదివారం వాతావరణం పొడిగా ఉంటుంది. అక్కడక్కడ పాక్షికంగా మేఘావృతంగా ఉండే అవకాశం. శనివారం గాలిలో తేమ 97 శాతం ఉంది.

## న్యూస్‌రీల్

### 10న ఆర్చరీ జట్ల ఎంపికలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జిల్లా సబ్ జూనియర్ ఆర్చరీ జట్ల ఎంపికలు ఈ నెల 10వ తేదీన నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఉదయం 9 గంటలకు జరుగుతుందని ఆ అసోసియేషన జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పలంరెడ్డి శ్రీహర్ష, పావురాల వేణు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 23 నుంచి రాజమండ్రిలో జరిగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర 41వ ఎన్‌టీపీసీ సబ్ జూనియర్ బాలబాలికల ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఆసక్తి ఉన్న వారు ఆధార్, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలన్నారు. ఇతర వివరాలకు 9441955334 నంబరులో సంప్రదించాలన్నారు.

### 1.19 కోట్ల పనిదినాలే లక్ష్యం

- పండ్ల తోటలు, ఇంకుడు గుంతలపై ప్రత్యేక దృష్టి
- డ్వామా పీడీ గంగాభవాని

నెల్లూరు (పొగతోట): ఉపాధి హామీ పథకానికి సంబంధించి ఈ ఆర్థిక సంవత్సరంలో 1.19 కోట్లు పనిదినాలు కల్పించేలా అవసరమైన చర్యలు చేపట్టాలని డ్వామా పీడీ గంగాభవానీ అధికారులను ఆదేశించారు. శనివారం డ్వామా కార్యాలయంలో ఏపీడీలు, ఏపీఓలు, ఈసీలతో నిర్వహించిన సమావేశంలో పీడీ మాట్లాడారు. ఈ ఆర్థిక సంవత్సరంలో జాబ్‌కార్డు కలిగిన ఉపాధి హామీ కూలీలకు నూరు శాతం పని దినాలు లక్ష్యంగా నిర్దేశించామన్నారు. అర్హత ఉన్న రైతుల పొలాల్లో పండ్ల తోటలను పెంచేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు తీయించాలన్నారు. హౌసింగ్‌కు సంబంధించి 90 పని దినాలను కల్పించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు సుస్థిర ఆస్తుల కల్పన కోసం పశువులు, గొర్రెలు కోళ్లు, వాటి సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. నిర్దేశించిన లక్ష్యాలను సాధించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ సమావేశంలో క్లస్టర్ ఏపీడీలు, ఏపీఓలు, ఈసీలు పాల్గొన్నారు.

### సాయుధ దళాల పతాక నిధికి సహకరిద్దాం


- కలెక్టర్ ఆనంద్



ఎన్‌సీసీ క్యాడెట్లతో కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(అర్బన్): సాయుధ దళాల పతాక నిధికి ప్రతి ఒక్కరూ సహకరించి విరాళాలు అందజేయాలని కలెక్టర్ ఆనంద్ పిలుపునిచ్చారు. సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టర్ శనివారం క్యాంపు కార్యాలయంలో మొదటి విరాళాన్ని హుండీలో వేసి ప్రారంభించారు. ఎన్‌సీసీ క్యాడెట్లు పతాక దినోత్సవ స్టిక్కర్‌ను కలెక్టర్ షర్ట్‌కు అలంకరించారు. అనంతరం కలెక్టర్ ఎన్‌సీసీ క్యాడెట్లతో మాట్లాడుతూ 1949లో సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని ప్రారంభించడం, ఫ్లాగ్ ఫండ్ కూడా ఏర్పాటు చేశారన్నారు. మాజీలు, క్షతగాత్రులైన సైనికుల కోసం ఈ ఫండ్ వినియోగిస్తారన్నారు. గతేడాది జిల్లాలో పెద్ద మొత్తంలో ఫ్లాగ్ ఫండ్ సమకూరిందన్నారు. విద్యాలయాలు, మెప్మా, డీఆర్‌డీఏలోని స్వయంశక్తి సంఘాల మహిళలు పెద్ద మొత్తంలో ఫండ్‌ను సమకూర్చారని కొనియాడారు. అదే స్ఫూర్తితో ఈ సంవత్సరం ఫండ్ సేకరించాలని కోరారు. అంతకు ముందు మాజీ సైనికులు, అధికారులు, ఎన్‌సీసీ క్యాడెట్లు నగరంలో ర్యాలీ నిర్వహించి కలెక్టర్ క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ అధికారి పద్మజ తదితరులు పాల్గొన్నారు.

### లక్ష్మీనరసింహుడికి 60 వేల అమెరికన్ డాలర్లు



ఆలయ ఏసీ శ్రీనివాసులురెడ్డికి చెక్కు అందజేస్తున్న దాతలు

రాపూరు: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం పెంచలకోన దేవస్థానంలో లడ్డూ పోటు నిర్మాణానికి వైఎస్సార్ జిల్లాకు చెందిన సానేపల్లి రామ్మోహన్‌రెడ్డి తన తల్లిదండ్రులు చిన్నపెంచలరెడ్డి, లక్ష్మమ్మ పేరిట శనివారం 60 వేల (రూ.50 లక్షలు) అమెరికన్ డాలర్లు విరాళంగా అందించారు. ఈ మేరకు దేవస్థానం ఏసీ శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. దాతకు మూడు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయించి, తీర్థ ప్రసాదాలు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అన్నవరం ప్రసాద్‌రెడ్డి, రామోహన్‌రెడ్డి, నరసింహారెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీలో క్వార్ట్జ కుంపటి

జిల్లాలో టీడీపీ ప్రజాప్రతినిధులు గడిచిన ఆరు నెలలుగా ప్రజాపాలనను గాలికి వదిలేశారు. ఇసుక, మట్టి, గ్రావెల్ వంటి సహజ వనరుల దోపిడీపై దృష్టి సారించారు. మద్యం వ్యాపారం పరంగా వాటాలు ఫిక్స్ చేసుకున్నారు. తాజాగా జిల్లాలో విస్తారంగా దొరికే క్వార్ట్జ్ గనులపై పడ్డారు. ఆ గనుల్లో వాటాలు దక్కించుకునేందుకు పైరవీలు చేస్తున్నారు. అయితే ఆ గనులన్నీ జిల్లా ఎంపీ చేతిలో ఉండడం, వాటిని ఆయన తన ముఖ్య అనుచరులకే అప్పగించడంతో జిల్లా టీడీపీలో 'తెల్లరాయి' రాజకీయం వేడెక్కుతోంది.

**ఎంపీ వేమిరెడ్డి గుప్పెట్లో సైదాపురం గనులు**

- ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలందరూ ఏకం
- గనుల్లో తమకూ వాటాలు కావాలంటూ డిమాండ్
- గనులను ఒక్కడికే కట్టబెట్టడాన్ని వ్యతిరేకిస్తున్న వైనం


సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జిల్లా టీడీపీలో క్వార్ట్జ్ కుంపటి రగులుతోంది. ఏకంగా సీఎంఓలోనే పంచాయితీ పెట్టినా.. ఫలితం లేకపోవడంతో నేరుగా ఎంపీకే అల్టిమేటం ఇచ్చే విధంగా ఏకమయ్యారు. జిల్లాలోని సైదాపురం, పొదలకూరు, చేజర్ల, ఉదయగిరితోపాటు తిరుపతి జిల్లాలో గూడూరు ప్రాంతాల్లో దొరికే మైకా, మైకా క్వార్ట్జ్, క్వార్ట్జ్, పల్స్‌పర్, వర్‌ముఖ్‌లైట్ ఖనిజాలకు దేశీయంగానే కాకుండా విదేశాల్లో కూడా ప్రస్తుతం మంచి గిరాకీ ఉంది. జిల్లాలో 7 భూగర్భ గనులు, 130 ఓపెన్ మైనింగ్ క్వారీలు, 26 కాలం చెల్లిన గనులు ఉన్నాయి. అయితే ఇందులో 60 ఓపెన్ మైనింగ్ క్వారీలు ఇతర ప్రాంతాల్లో ఉన్నాయి. మిగతావన్నీ ఒక్క సైదాపురంలో ఉన్నాయి.

**తెల్లరాయిలో టీడీపీ రాబందులు**

సైదాపురంలోని ఓపెన్ మైనింగ్ క్వారీలతోపాటు భూగర్భ గనులు, కాలం చెల్లిన గనుల్లో మరో వందేళ్ల పాటు మైనింగ్ చేసినా తరగని మైకా క్వార్ట్జ నిల్వలు అపారంగా ఉన్నాయి. ఇక్కడ ఇప్పటికే వేస్ట్ ఖనిజంగా పక్కన పడేసిన మైకా క్వార్ట్జ ఖనిజానికి ఇప్పుడు మార్కెట్లో గిరాకీ ఉంది. టన్ను రూ.20 వేల నుంచి రూ.2 లక్షల వరకు పలుకుతోంది. అయితే మొదటి నుంచి అక్కడే పాగా వేసిన ఎంపీ ముఖ్య అనుచరుడు, నెల్లూరు కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ పోలుబోయిన రూప్‌కుమార్ ఆ గనులపై దృష్టి పెట్టాడు. అప్పటికే జిల్లాలోని జిల్లాలోని ఎమ్మెల్యేలందరూ ఇసుక, గ్రావెల్, మట్టి అక్రమ రవాణాపై తలమునకలై ఉండడంతో ఎంపీ దృష్టి రూ.వేల కోట్ల విలువైన క్వార్ట్జ ఖనిజంపై పడింది. సీఎంలో తనకున్న పలుకుబడి ఉపయోగించి, స్థానికంగా క్వార్ట్జ ఆధారిత పరిశ్రమ ఏర్పాటు ప్రతిపాదనతోపాటు రోజుకు రూ.కోటి ప్రభుత్వ పెద్దలకు ఇచ్చే విధంగా లోపాయికారి ఒప్పందాలు చేసుకుని తమ గుప్పెట్లోకి తెచ్చుకున్న విషయంపై ఇప్పుడు దుమారం రేగుతోంది. ఆయా గనులను దక్కించుకునేందుకు కూటమి నేతలు పోటీ పడుతున్నారు. ఆయా గనులకు అనుమతులు తెచ్చుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. సైదాపురంతో పాటు జిల్లాలో మిగతా గనులు సైతం ఎంపీ వేమిరెడ్డి కాదనే ఎమ్మెల్యేలకు ఇచ్చే అవకాశం లేదని సీఎంఓలోని ప్రభుత్వ పెద్దలు స్పష్టం చేసినట్లు సమాచారం. ఈ విషయంలో సీఎంఓ కూడా ఎంపీ వేమిరెడ్డి వద్దనే పంచాయితీ తేల్చుకోమని తెగేసినట్లు తెలిసింది.



సైదాపురంలో లారీలకు లోడింగ్ చేస్తున్న క్వార్ట్జ మెటల్ (ఫైల్)




**ఆయనా.. మేమా?.. చెప్పండి**

సైదాపురంలోని తెల్లరాయి గనులపై అవగాహన లేని టీడీపీ ఎమ్మెల్యేలందరూ ఆ గనులకు అనుమతులివ్వాలంటూ ఎంపీ వేమిరెడ్డిపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. డిప్యూటీ మేయర్ ఒక్కడే కావాలా?... మేమంతా కావాలా తేల్చుకోవాలంటూ రాజకీయంగా అల్టిమేటం ఇస్తున్నారు. మంత్రి నారాయణ, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి మినహా మంత్రి ఆనంతోపాటు మిగతా ఎనిమిది ఎమ్మెల్యేలు సైతం ఆ గనుల్లో వాటాల కోసం ఎంపీపై ఒత్తిడి తెస్తున్నారని సమాచారం.

## అట్టహాసంగా జేఎన్‌టీయూ వాలీబాల్ సెలక్షన్స్



పోటీలకు హాజరైన విద్యార్థులను పరిచయం చేసుకుంటున్న జేఎన్‌టీయూ విశ్వవిద్యాలయం క్రీడా మండలి కార్యదర్శి ప్రొఫెసర్ టీ నారాయణ రెడ్డి

బిట్రగుంట: బోగోలు మండలం కడనూతలలోని రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో జేఎన్‌టీయూ (అనంతపురం) యూనివర్సిటీ స్థాయి వాలీబాల్ సెలక్షన్స్ పోటీలు శనివారం అట్టహాసంగా జరిగాయి. యూనివర్సిటీ పరిధిలోని అన్ని జిల్లాల ఇంజినీరింగ్ కళాశాలల నుంచి సుమారు 215 మందికి పైగా విద్యార్థులు పోటీలకు హాజరవడంతో కళాశాల ప్రాంగణం కోలాహలంగా మారింది. జేఎన్‌టీయూ విశ్వవిద్యాలయం క్రీడా మండలి కార్యదర్శి, వాలీబాల్ సెలక్షన్స్ సమన్వయకర్త ప్రొఫెసర్ టీ నారాయణరెడ్డి, కళాశాల కరస్పాండెంట్ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఎంపిక ప్రక్రియకు ముఖ్య అతిథులుగా హాజరై పోటీలను పర్యవేక్షించారు. అనంతపురం జేఎన్‌టీయూ పరిధిలోని వైఎస్సార్, చిత్తూరు, కర్నూలు, అనంతపురం, నెల్లూరు జిల్లాల నుంచి 115 మంది విద్యార్థులు, 60 మంది విద్యార్థినులు పోటీలకు హాజరు కాగా వేర్వేరుగా పోటీలు నిర్వహించారు. విద్యార్థుల కేటగిరీ నుంచి 12 మందిని, అదనంగా మరో నలుగురిని, విద్యార్థినుల కేటగిరీ నుంచి 12 మందిని, అదనంగా మరో నలుగురిని ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 17వ తేదీన కేరళలోని కేరళ యూనివర్సిటీలో జరగనున్న జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు అనంతపురం జేఎన్‌టీయూ నుంచి పోటీలో ఉంటారని సమన్వయ కర్త ప్రొఫె సర్ టీ నారాయణరెడ్డి తెలిపారు. పోటీలకు విక్రమ సింహపురి యూనివర్సిటీ, కావలి జేబీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్లు డాక్టర్ ఏ ప్రవీణ్ కుమార్, డాక్టర్ ప్రసాద్‌రెడ్డి, కావలి వన్ టౌన్ ఎస్సై జమాల్ వలి, వివిధ కళాశాలల ఫిజికల్ డైరె క్టర్లు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో రామిరెడ్డి బాలసాకేత్ రెడ్డి, కళాశాల ఏఓ ఆర్వీ రమణా రెడ్డి, కార్యక్రమ సమన్వయకర్త లక్ష్మి, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ కిరణ్‌కుమార్, వివి ధ విభాగాధిపతులు తదితరులు పాల్గొన్నారు.



### పెళ్లికి ఘటోత్కచుడు

కావలి పట్టణంలో జరిగిన ఓ వివాహ వేడుకకు ఒక అతిథి ఘటోత్కచుడు వేషధారణలో హాజరై అందరిని అలరించాడు. వివాహ వేడుకలకు మహిళల నుంచి పురుషుల వరకు తమ అభిరుచులు, సంస్కృతి సంప్రదాయ వస్త్రధారణ, అలంకరణతో విచ్చేసి ప్రత్యేకతను చాటుకోవడం పరిపాటి. అయితే ఆహుతులు విందు భోజనంలో రుచులను ఆస్వాదిస్తుండగా ఓ అతిథి ఘటోత్కచుడు వేషధారణతో 'వివాహ భోజనంబు వింతైన వంటకంబు.. వియ్యాలవారి విందు ఓ హో.. హో నాకే.. ముందు.. అహహహహ అహ హహహ..' అంటూ 1957లో విడుదలైన మాయాబజార్ సినిమాలో పాటతో హావభావాలతో ఎస్వీ రంగారావును గుర్తు చేస్తూ అక్కడికి చేరుకుని సందడి చేశారు. వివాహ వేడుకల్లో గమ్మత్తైన ఈ దృశ్యాన్ని చూస్తూ ఆస్వాదించారు.

– కావలి

## జేబీకి నాలుగు చాంపియన్‌షిప్‌లు



చాంపియన్‌షిప్‌లు సాధించిన క్రీడాకారులతో విశ్వోదయ రెక్టార్ డి.వినయ్‌కుమార్ రెడ్డి, కళాశాల కరస్పాండెంట్ వి.సుధాకర్ రెడ్డి తదితరులు

కావలి : జవహర్ భారతి డిగ్రీ కళాశాలలో ఈ నెల 6, 7 తేదీల్లో విక్రమ సింహపురి యూనివర్సిటీ నిర్వహించిన అంతర కళాశాలల అథ్లెటిక్ మీట్‌లో జేబీ డిగ్రీ కళాశాలకు నాలుగు చాంపియన్‌షిప్‌లు దక్కినట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్, స్వయం ఉపాధి కోర్సుల డైరెక్టర్ డాక్టర్ ఆర్.మాల్యాద్రి తెలిపారు. శనివారం చాంపియన్‌షిప్ సాధించిన విజేతలను, పీడీ ప్రసాద్ రెడ్డిని విశ్వోదయ రెక్టార్ డి.వినయ్‌కుమార్ రెడ్డి, కళాశాల కరస్పాండెంట్ వి.సుధాకర్ రెడ్డి అభినందించారు. ఆయన మాట్లాడుతూ ఈ పోటీల్లో జవహర్ భారతి డిగ్రీ కళాశాలకు చెందిన ఎం.మహేష్ బాబు (ఫైనల్ బీఏ) 18 పాయింట్స్‌తో పురుషుల విభాగంలో వ్యక్తిగత చాంపియన్, వాయల అపర్ణ (ఫస్ట్ బీఎస్సీ) 25 పాయింట్లతో మహిళా విభాగంలో వ్యక్తిగత చాంపియన్ కైవసం చేసుకున్నారన్నారు. ఓవరాల్ పురుషుల స్పోర్ట్స్ చాంపియన్‌షిప్ 80 పాయింట్లతో, 53 పాయింట్లతో మహిళల ఓవరాల్ స్పోర్ట్స్ చాంపియన్‌షిప్ జవహర్‌భారతి కళాశాలకు దక్కాయన్నారు. వీటితో పాటు పురుషులు గేమ్స్ చాంపియన్ షిప్ 105 పాయింట్లతో, మహిళ గేమ్స్ చాంపియన్‌షిప్ 60 పాయింట్లతో జవహర్ భారతి డిగ్రీ కళాశాల విద్యార్థులు విక్రమ సింహపురి యూనివర్సిటీ స్పోర్ట్స్ గేమ్స్‌ల్లో అందించే నాలుగు చాంపియన్‌షిప్‌లను సాధించి అగ్రస్థానంలో నిలిపారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఎంపీహెచ్‌ఓల తొలగింపు అన్యాయం

కలిగిరి: వైద్యారోగ్యశాఖలో 20 ఏళ్లుగా విధులు నిర్వర్తిస్తున్న మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లను ప్రభుత్వం తొలగించడం అన్యాయమని, వెంటనే తిరిగి విధుల్లో కొనసాగించాలని ఏపీ హంస అసోసియేషన్ జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ కప్పా నారాయణరాజు డిమాండ్ చేశారు. కలిగిరిలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం విడుదల చేసిన మెమో 10696 ప్రకారం మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లను తొలగించకుండా అధికారులు పునఃపరిశీలించి ప్రత్యేకమైన ఉత్తర్వులు ఇచ్చి వారికి న్యాయం చేయాలని కోరారు. వింజమూరు తాలుకా పబ్లిసిటీ సెక్రటరీ సువ్వారి తిరుపతిరావు పాల్గొన్నారు.

## పోలీస్ పహారాలో పీటీఎం

**నామమాత్రంగా తల్లిదండ్రుల హాజరు**

- పాఠశాలల్లో అంతంత మాత్రంగా స్వాగత ఏర్పాట్లు
- మామిడి ఆకులు, కాగితాల పూలతో మమ
- అతిథులు, పేరెంట్స్ కోసం కుర్చీలు, బెంచీలు మోసిన విద్యార్థులు
- తల్లిదండ్రులకు మధ్యాహ్న భోజనమే వడ్డించిన వైనం

రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో అట్టహాసంగా నిర్వహించాలని భావించిన పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ పోలీస్ పహారాలో ప్రహసనంగా సాగింది. తల్లిదండ్రుల ఆహ్వానం నుంచి.. కార్యక్రమం నిర్వహణ వరకు మొక్కుబడిగా నిర్వహించారు. పాఠశాల ముందు, గది అలంకరణకు మామిడి ఆకులు, అరటి ఆకులు, కాగితాల పూలతో అలంకరించి మమ అనిపించారు. అతిథులు, పేరెంట్స్ వస్తున్నారని తెలిసినా సరిపడా కుర్చీలు ఏర్పాటు చేయలేదు. పాఠశాలలో ఉన్న వాటితోనే సరిపెట్టారు. విద్యార్థులు ఇటీవల కురిసిన వర్షానికి తడిసిన బురద నేలపైనే కూర్చొన్నారు. ఆఖరికి తల్లిదండ్రులకు మధ్యాహ్న భోజనమే వడ్డించడం విశేషం.



మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్



ఎండలో కటిక నేలపై కూర్చొని విద్యార్థుల ఇబ్బందులు

నెల్లూరు (టౌన్): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ పోలీస్ పహారా మధ్య జరిగింది. ఈ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా, ఒక పండగ వాతావరణంలో నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారులను రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. అయితే ఎక్కడా పండగ వాతావరణమే కనిపించలేదు. విద్యార్థుల నుంచి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, అతిథుల వరకు గంభీర వాతావరణమే కనిపించింది. విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కల్పించడం కోసమే అంటూ ప్రతి పాఠశాల వద్ద ఇద్దరు కానిస్టేబుల్స్‌ను, జెడ్పీ ఉన్నత పాఠశాలల వద్ద ఎస్సై, సీఐ స్థాయి అధికారులు బందోబస్తు నిర్వహించారు. సమావేశానికి హాజరయ్యే తల్లిదండ్రులు 'తల్లికి వందనం'పై నిలదీసే అవకాశం ఉందని ఇంటెలిజెన్స్, స్పెషల్ బ్రాంచ్ నివేదికల నేపథ్యంలో ఎదురుగా పోలీసులు ఉంటే.. ఎవరూ కూడా ఏమీ మాట్లాడరని భావించిన ప్రభుత్వం రాత్రికి రాత్రే పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఉపాధ్యాయులు కొరత, సిలబస్ పూర్తి కాకపోవడం, వసతులపై తల్లిదండ్రులు ఎక్కడ నిలదీస్తారో అనే విషయాన్ని ముందుగానే గుర్తించిన స్కూల్ హెడ్‌మాస్టరు ఒకరిద్దరు విద్యార్థులు, తల్లిదండ్రులకు ముందుగానే స్క్రిప్ట్ ఇచ్చి మంచిగా చెప్పించారు.

**చిత్తు కాగితాలపై ఆహ్వానం**

పీటీఎం కార్యక్రమానికి ప్రభుత్వం మొక్కుబడిగా నిధులు మంజూరు చేయడంతో జిల్లాలో ఆయా పాఠశాలల హెడ్‌మాస్టర్లు, ఉపాధ్యాయులు సైతం తల్లిదండ్రులకు అంతంత మాత్రంగానే ఆహ్వానాలు పంపించి, కార్యక్రమాలను సైతం అదే స్థాయిలో నిర్వహించారు. పిల్లల నోటు పుస్తకంలో తల్లిదండ్రులను ఆహ్వానిస్తున్నట్లు విద్యార్థులతో చేత రాయించి అదే ఆహ్వానంగా తల్లిదండ్రులకు పంపించారు. పాఠశాల యాజమాన్యం దగ్గర ఉన్న ఫోన్ నంబర్లకు మెసేజ్‌లు పంపించారు. జిల్లాలో ఎక్కువ పాఠశాలలో కనీసం సామియానాలు కూడా వేసిన పరిస్థితి లేదు. పాఠశాలలో ఉన్న కుర్చీలు, బెంచీలనే వినియోగించారు. ఎమ్మెల్యేలు, మంత్రులు వచ్చే పాఠశాలలకు మాత్రం అరటి బోదెలు, కాగితాల పూలు, మామిడి ఆకులతో స్వాగత తోరణాలు కట్టారు. జిల్లాలో మిగిలిన పాఠశాలల్లో మామిడి తోరణాలతోనే ముగించారు.

**విద్యార్థులే కూలీలు..**

పాఠశాలల్లో నిర్వహించిన పీటీఎం ఏర్పాట్లను ఆయా పాఠశాలల్లో చదివే విద్యార్థులే కూలీలుగా మారి చేపట్టాల్సి వచ్చింది. స్వాగత తోరణాల నుంచి అతిథులకు కుర్చీలు వేసే వరకు అన్నీ వారై చేశారు. స్థానిక పొదలకూరు రోడ్డులోని జెడ్పీ హైస్కూల్‌లో కలెక్టర్ సాక్షిగా విద్యార్థులు కుర్చీలు, బెంచీలను మోశారు. అతిథులకు ఆహ్వానం పలికేందుకు గంటల తరబడి నిల్చుని, బురద నేలపై కూర్చొని ప్రసంగం విన్నారు. ఈ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆశించిన స్థాయిలో తల్లిదండ్రులు హాజరు కాలేదని సమాచారం.

**ఆటల పోటీల్లో పాల్గొనేందుకు నిరాసక్తత**

మీటింగ్ అనంతరం మహిళలకు ముగ్గులు పోటీలు, పురుషులకు టగ్ ఆఫ్ వార్‌ను నిర్వహించాలని ఆదేశించారు. అయితే ఈ పోటీల్లో పాల్గొనేందుకు తల్లిదండ్రులు విముఖత కనబరిచారు. మీటింగ్‌కు వచ్చిన తల్లిదండ్రులు, అతిథులకు ప్రతిరోజు వడ్డించే మధ్యాహ్న భోజనాన్నే వడ్డించారు. స్పెషల్ ఐటమ్‌ను ఇవ్వాలన్నా దాతలు ముందుకు రాకపోవడంతో ఆ భోజనంతోనే సరిపెట్టారు. దీంతో ఎక్కువ మంది తల్లిదండ్రులు ఇళ్లకు వెళ్లిపోయారు.



పొదలకూరు రోడ్డులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో టేబుల్స్ మోస్తున్న విద్యార్థులు



దర్గామిట్టలోని కాంత్రినగర్ పాఠశాలలో అరకొరగా హాజరైన తల్లిదండ్రులు



పొదలకూరు రోడ్డులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో అతిథులను ఆహ్వానిస్తూ ఎండలో విద్యార్థినుల పాట్లు

**బురద నేలపైనే విద్యార్థులు..**

జిల్లాలో దాదాపు అన్ని పాఠశాలల్లో విద్యార్థులను ఎండలో గంటల తరబడి కూర్చొబెట్టి ఉపన్యాలిచ్చారు. పాఠశాలల్లో ఉన్న కుర్చీలు, బెంచీలను అతిథులకు వేయడంతో విద్యార్థులకు ఈ పరిస్థితి వచ్చింది. ఇటీవల వర్షాలు కురిస నేలంతా బురదగా ఉన్నప్పటికీ కనీసం వారికి కింద పట్ట కూడా వేయలేదు. మంచినీరు కూడా ఇవ్వలేదు.

# వివాహిత అనుమానాస్పద మృతి



కోవూరు: వివాహిత అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన కోవూరు మండలంలోని కొనమ్మతోట సమీపంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. కొనమ్మతోట సమీపంలో నివాసముంటున్న శిరీష (30)కు అదే ప్రాంతానికి చెందిన వెంకటరమణయ్యతో 12 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. ఆటో నడుపుకొని జీవనం సాగించే వెంకటరమణయ్య శనివారం బయటకెళ్లారు. మధ్యాహ్నం ఇంటికొచ్చి భార్యతో కలిసి భోజనం చేశారు. అనంతరం పిల్లలకు ఆమె భోజనం తిని పిస్తుండటంతో నిద్రించారు. సాయంత్రం నాలుగు గంటల సమయంలో బయటకెళ్లే ముందు బాత్‌రూమ్‌కు వెళ్లగా, అక్కడ ఆమె విగతజీవిగా పడి ఉండటాన్ని గమనించారు. కేకలేయడంతో చుట్టుపక్కల వారు చేరుకోగా, ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిందంటూ పొంతన లేకుండా చెప్పారు. మృతదేహాన్ని కోవూరు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా, అప్పటికే మృతి చెందారని వైద్యులు నిర్ధారించారు. ఘటన స్థలానికి పోలీసులు చేరుకొని వివరాలను సేకరించారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.

# ముగిసిన రీజినల్ పాలిటెక్ ఫెస్ట్



విజేతలకు బహుమతి ప్రదానం

కావలి: రూరల్ మండలంలోని రుద్రకోట వద్ద గల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన నెల్లూరు రీజియన్ పాలిటెక్ ఫెస్ట్ శనివారంతో ముగిసింది. ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు ప్రదర్శించిన ఇన్నోవేటివ్ ప్రాజెక్ట్‌లు ఆకట్టుకున్నాయి. కోవూరు సమీపంలోని గీతాంజలి.. కావలి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు మొదటి రెండు స్థానాల్లో నిలవగా, వీరికి రూ.25 వేలు, రూ.పది వేలను అందజేశారు. మొత్తం 20 ప్రాజెక్ట్‌లు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాయి. టెక్‌ఫెస్ట్‌ను కావలి డీఎస్పీ శ్రీధర్ సందర్శించారు స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ డిప్యూటీ సెక్రటరీ రవికుమార్, రామాయపట్నం పోర్టు మేనేజర్ శేషుకుమార్, ఇండోసాల్ ప్రైవేట్ లిమిటెడ్ డీజీఎం రంగారెడ్డి, గన్నవరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల హెడ్ ఆఫ్ జనరల్ సెక్షన్ బెహరా శ్రీనివాస్, కావలిలోని విట్స్ కళాశాల ప్రిన్సిపల్ నాగోశయ్య, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ సుశీల్‌కుమార్ ప్రియ తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో పడిపూజ



నెల్లూరు(బృందావనం): మండల పూజలను పురస్కరించుకొని నగరంలోని అయ్యప్పస్వామి దేవస్థానంలో పడిపూజను భక్తిశ్రద్ధలతో శనివారం నిర్వహించారు. తొలుత స్వామివారికి పుష్పాభిషేకాన్ని జరిపారు. అయ్యప్ప శరణుఘోషతో ఆలయం పులకించింది. ఉభయకర్తలుగా కనియంపాటి మాల్యాద్రి, మహాలక్ష్మి, చింతంరెడ్డి దశరథరామిరెడ్డి, లక్ష్మీకాంతమ్మ దంపతులు వ్యవహరించారు. అయ్యప్ప సేవా సమాజ పాలకమండలి అధ్యక్ష, కార్యదర్శులు శేషగిరిరావు, వెంకటరత్నం, కోశాధికారి రత్నయ్య తదితరులు పర్యవేక్షించారు.

## బైక్‌ను ఢీకొన్న కారు

వెంకటాచలం: బైక్‌ను కారు ఢీకొనడంతో ఇద్దరు గాయపడిన ఘటన మండలంలోని కాకుటూరు సమీపంలో గల జాతీయ రహదారిపై శనివారం చోటుచేసుకుంది. వివరాలు.. నెల్లూరులోని వైఎస్సార్‌నగర్‌కు చెందిన గాలేటి వెంకటేశ్వర్లు, పెంచలమ్మ దంపతులు పనినిమిత్తం ఓజిలికి బైక్‌పై వెళ్లారు. అనంతరం తిరిగి బయల్దేరగా, కాకుటూరు సమీపంలో గుర్తుతెలియని కారు ఢీకొని వెళ్లిపోయింది. క్షతగాత్రులను 108లో నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## పోలీసుల అదుపులో నిందితుడు

ఉదయగిరి: పట్టణంలోని గిరిజన కాలనీలో భార్యను హత్య చేసి పరారీలో ఉన్న భర్త మస్తాన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ జరుపుతున్నారని సమాచారం. పరారీలో ఉన్న నిందితుడ్ని పట్టుకునేందుకు పోలీస్ బృందాలను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో దుత్తలూరు మండలం వెంకటంపేట అటవీ ప్రాంతంలో ఉన్నారనే సమాచారంతో పోలీసులు చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారని సమాచారం.

## నిమ్మ ధరలు

పెద్దవి: రూ.31 సన్నవి: రూ.20
పండ్లు: రూ.12

## పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

| | |
|---|---|
| బ్రాయిలర్: | రూ.96 |
| లేయర్ | రూ.110 |
| బ్రాయిలర్ చికెన్: | రూ.180 |
| స్కిన్‌లెస్ చికెన్: | రూ.200 |
| లేయర్ చికెన్: | రూ.187 |

# మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

• ఎస్పీ కృష్ణకాంత్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కృష్ణకాంత్ తదితరులు

నెల్లూరు సిటీ: మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని ఎస్పీ కృష్ణకాంత్ పిలుపునిచ్చారు. ధనలక్ష్మీపురంలోని జెడ్పీ స్కూల్లో శనివారం నిర్వహించిన మెగా టీచర్స్, పేరెంట్స్ మీట్‌కు ఆయన హాజరయ్యారు. డ్రగ్స్ వద్దు బ్రో అనే అంశంపై విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించి పోస్టర్లను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. మాదకద్రవ్యాలు భవిష్యత్తును నాశనం చేస్తాయని, వీటికి దూరంగా ఉండాలని కోరారు. తమ పరిసరాల్లో గంజాయి విక్రయాలు, వినియోగంపై ప్రజలు సమాచారమిస్తే కఠిన చర్యలు చేపడతామని చెప్పారు. పిల్లల ప్రవర్తనను తల్లిదండ్రులు నిరంతరం గమనించాలని కోరారు. హెచ్ఎం గిరిధర్‌సింగ్, ఎస్బీ, రూరల్ డీఎస్పీలు శ్రీనివాసరావు, ఘట్టమనేని శ్రీనివాసరావు, ఎస్బీ సీఐ - 1 వెంకటేశ్వరరావు, నెల్లూరు రూరల్ సీఐ వేణు, విద్యాకమిటీ చైర్‌పర్సన్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ



నెల్లూరు (టౌన్): విక్రమ సింహపురి యూనివర్సిటీ ఇంటర్ కాలేజీ అథ్లెటిక్స్ పోటీల్లో నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాల విద్యార్థినులు ప్రతిభ చాటారని ప్రిన్సిపల్ గిరి పేర్కొన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థినులను కళాశాలలో శనివారం అభినందించిన అనంతరం ఆయన మాట్లాడారు. 100 మీటర్ల పరుగుపందెంలో ప్రిస్కిల్లా, శిరీషా ప్రథమ, తృతీయ స్థానాల్లో నిలిచారని చెప్పారు. 200, 400 మీటర్ల పరుగు పందెం తదితరాల్లో అత్యుత్తమ ప్రతిభ చూపారని తెలిపారు.

# హోంగార్డ్స్ డీఎస్పీ బాధ్యతల స్వీకరణ



నెల్లూరు(క్రైమ్): హోంగార్డ్స్ డీఎస్పీగా వెంకటరమణ నగరంలోని పాత జిల్లా పోలీస్ కార్యాలయంలో బాధ్యతలను శనివారం స్వీకరించారు. పుష్పగుచ్ఛాలను సిబ్బంది అందజేసి శుభాకాంక్షలను తెలియజేశారు. అనంతరం ఎస్పీ కృష్ణకాంత్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. హోంగార్డుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని ఆయన చెప్పారు.

## టైరును పరిశీలిస్తూ అనంతలోకాలకు

• గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో లారీ డ్రైవర్ మృతి



కొడవలూరు: టైరు పంక్చరైందనే అనుమానంతో లారీని పక్కన నిలిపి పరిశీలిస్తుండగా, వెనుక నుంచి వేగంగా వచ్చిన గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందిన ఘటన నార్తురాజుపాళెం ఫ్లైఓవర్‌పై శనివారం చోటుచేసుకుంది. ఎస్సై కోటిరెడ్డి వివరాల మేరకు.. విజయవాడ వైపు బయల్దేరిన లారీ టైరు పంక్చరైందనే అనుమానంతో వాహనాన్ని పక్కన నిలిపి డ్రైవర్ దాడి వెంకటరాధాకృష్ణారావు (34) పరిశీలించసాగారు. ఈ క్రమంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని వెళ్లిపోయింది. తీవ్రంగా గాయపడిన ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడ్ని కృష్ణా జిల్లా ఏ కొండూరు మండలం గొల్లమందల వాసిగా గుర్తించారు. ఘటనపై కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు



సంగం: గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన మండలంలోని తరుణవాయి సమీపంలో నెల్లూరు – ముంబై జాతీయ రహదారిపై శనివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన చిరంజీవి పని నిమిత్తం బైక్‌లో సంగం వచ్చారు. తిరిగెళ్తుండగా, తరుణవాయి వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో చిరంజీవి రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడ్ని 108లో వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.